క్లుప్తంగా

మహిళ అదృశ్యం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై పవణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దంపేటకు చెందిన తాటిపల్లి సరిత(28) ఈనెల 8న మహారాష్ట్ర సిరొంచ తాలూకా అంకీస గ్రామంలోని అమ్మమ్మ అంకమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. కాగా తిరిగి రాకపోవడంతో ఆమె కోసం బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో సరిత భర్త శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా ఆమెకు ముగ్గురు సంతానం ఉందని తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

కాళేశ్వరం: రెండవ విడత దళితబంధు బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్ర సచివాలయం ముట్టడికి హైదరాబాద్‌కు వెళ్తున్న మహదేవపూర్ మండలం ఎడపల్లికి చెందిన వేమునూరి జక్కయ్యను మండల కేంద్రంలో ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్సై పవణ్‌కుమార్ తెలిపారు. ముట్టడికి వెళ్తున్న క్రమంలో ఏదైన నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ఆయనపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి..

రేగొండ: రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడతపల్లి గ్రామానికి చెందిన అంగడి ప్రత్యూష, అంగడి మల్లయ్యతో అదే గ్రామానికి చెందిన నంబుల మహేష్, బండారి రాకేష్ పాత కక్షలతో గొడవ పడ్డారు. తమను నంబుల మహేష్, బండారి రాకేష్ కులం పేరుతో దూషించారని పోలీస్ స్టేషన్‌లో ప్రత్యూష ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

టేకుమట్ల : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి(బి)లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుక్కల సాంబయ్య (58) గ్రామ శివారులోని చలివాగులో గురువారం సాయంత్రం చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందినట్లు తెలిపారు. కాగా సాంబయ్య మృతదేహాన్ని అదే గ్రామానికి చెందిన కాసాని సంతోష్ చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. శుక్రవారం మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఎంఈఓను నియమించాలి

వెంకటాపురం(కె): మండలంలో రెగ్యూలర్ ఎంఈఓను నియమించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రేగ గణేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెగ్యూలర్ ఎంఈఓ లేకపోవటం వల్ల పాఠశాలలపై పర్యవేక్షణ లోపించి విద్యావ్యవస్థ కుంటుపడుతుందని అన్నారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సక్రమంగా లేక అందరు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు మండలంలో రెగ్యూలర్ ఎంఈఓను నియమించి పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల మహేష్, అట్టం మోహనరావు, పూనెం ప్రతాప్ ఉన్నారు.

స్థల పరిశీలన

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని లింగాల గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని ఇటీవల నిర్వహించిన విద్యుత్ వినయోగాదారుల ఫోరం కార్యక్రమంలో లింగాల గిరిజనులు సబ్‌స్టేషన్ నిర్మించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఫోరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ ఏడీఈ వేణుగోపాల్, సబ్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్, ఏఎల్ఎం శ్రీనివాస్‌లు గ్రామస్తులతో కలిసి సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

వెంచరామికి బస్సేది?

- నిలిచిపోయిన సర్వీస్
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని వెంచరామి గ్రామం మారుమూల ప్రాంతం దాదాపు 541 జనాభా. కాగా, వారికి గతంలో ఆర్టీసీ బస్సు వచ్చేది. కాని కొంత కాలం నుంచి బస్సు రాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరి దారుణం. కుర్మపల్లి నుంచి వెంచరామికి రావాల్సిన విద్యార్థులు వర్షాకాలంలో తడుచుకుంటూ పాఠశాలకు రావాల్సిన దుస్థితి. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ ఆస్పత్రికి పోవాలంటే ఇబ్బందికరంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. మండల కేంద్రానికి వెళ్లి రావాలంటే నడుచుకుంటూ ఐదు కిలోమీటర్లు అందుకుతండాకు వెళ్లి అక్కడ బస్సు ఏక్కాల్సిన పరిస్థితి. గతంలో పరకాల డిపో నుంచి అందుకుతండాకు వచ్చే బస్సు వెంచరామి వరకు వచ్చేదని ఇప్పుడు ఆ బస్సును రద్దు చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సేవలను కొనసాగించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పిన సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం వారు గ్రామంలో నిరసన తెలిపారు.

ఎన్నికలప్పుడే గుర్తుకొస్తామా?

రాజకీయ నాయకులకు తమ గ్రామం ఎన్నికలప్పుడే గుర్తుకోస్తుందా అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అనేక సమస్యలతో సతమతమవుతున్నామని తెలిపారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం లేదని, అభివృద్ధికి నోచుకోవడం లేదని వాపోతున్నారు. కేవలం ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు వచ్చి మాటాలు చెప్పి వెళ్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం అమలు కావడం లేదని తెలుపుతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, అలాగే మాకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



వెంచరామి గ్రామం

బస్సు సౌకర్యం కల్పించాలి



వెంచరామి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి. సంబంధిత అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేదు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి.

- బొమ్మ శరత్, వెంచరామి గ్రామస్తుడు

అంగన్‌వాడీ కేంద్రానికి బెంచీల అందజేత



బెంచీలను అందజేస్తున్న అమర్నానాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ, ముచినిపర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు బెంచీలను చల్లగరిగ గ్రామానికి చెందిన కర్రే అమర్నాథ్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డిల తల్లి సరోజన చేతుల మీదుగా శుక్రవారం అందజేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద తెలిపారు. తమ తండ్రి కర్రె నరసింహారెడ్డి, నానమ్మ లక్ష్మిల జ్ఞాపకార్థం అంగన్‌వాడీ కేంద్రాలకు బెంచీలను బహుకరించినట్లు అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తులు కర్రె అశోక్‌రెడ్డి, కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, కరుణ, శారద, కనకలక్ష్మీ, కవిత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిపై అవగాహన



మాట్లాడుతున్న టీం సభ్యులు

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి గ్రామంలో శుక్రవారం నీతి అయోగ్ పిరమల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు గ్రామ అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా, ఆరోగ్యం, న్యూట్రీష్యన్, తాగునీరు, శానిటేషన్, తదితర విషయాలను ఎస్‌హెచ్‌జీ మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ అభివృద్ధి గురించి అందరు కలిసి పిరమల్ ఫౌండేషన్ టీం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సీసీ రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు స్వప్న, లక్ష్మి గ్రామ సంఘం సభ్యులు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ లీడర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందంజ



మహాముత్తారం: మాట్లాడుతున్న సంజీవరెడ్డి

మహాముత్తారం: ఇస్రో సైంటిస్టుల కృషితో చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలిదేశంగా మన దేశం ఒక నూతన చరిత్రను సృష్టించిందని ములుగుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాశం సంజీవరెడ్డి అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రుడిపై కాలుమోపిన నాలుగో దేశంగా మనదేశం తనకీర్తి ప్రతిష్టలను శక్తిసామర్థ్యాలను అంతర్జాతీయ స్థాయిలో గొప్పగా చాటిచెప్పినట్లు అయిందని అన్నారు. అదే ప్రతీ విద్యార్థి శాస్త్రావేతలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం అనిల్‌నాయక్, చంద్రకళ, యాదగిరి, సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు ఉన్నారు.



చిట్యాల: చంద్రయాన్-3 నమూనాను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

చిట్యాల: మండలంలోని జూకల్ జిల్లా ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణ విద్యార్థులతో చంద్రయాన్ 3 నమూనా ఆవిష్కరించారు. విజ్ఞాన శాస్త్రానికి ఆవిష్కరణలు ఎంతోగానో దోహద పడుతాయని తెలిపారు.

చెట్లకు రక్షణేది?



చెట్టును నరుకుతున్న వ్యక్తి

టేకుమట్ల: చెట్లను రక్షించాల్సిన ప్రజలే ప్రభుత్వం నాటించిన చెట్లను నరుకుతూ ఇష్టారీతిన వ్యవహిస్తున్నారు. టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో గతంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన చెట్టును శుక్రవారం పట్టపగలే ఒక వ్యక్తి మేకల మేత కోసం నరుకుతుండగా అటుగా వెళ్తున్న రామకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి అడ్డుకుని పంచాయతీ కార్యదర్శి సాంబశివుడుకి సమాచారం అందించాడు. దాంతో పంచాయతీ కార్యదర్శి అక్కడకు చేరుకునేలోపు సదరు వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చెట్టును నరికిన వ్యక్తితో నేడు(శనివారం) ఐదు చెట్లను నాటించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సాంబశివుడు తెలిపారు.

ఆదివాసీ ఎరుకల అభివృద్ధికి కృషి

కాళేశ్వరం: గ్రామాల్లో ఆదివాసీ ఎరుకల సంఘాలు ఏర్పాటు చేసి ఆదివాసీ ఎరుకల అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి సుభాష్ తెలిపారు. శుక్రవారం కాళేశ్వరంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆదివాసీ ఎరుకల సంఘం ఉపాధ్యక్షుడిగా కాళేశ్వరానికి చెందిన దుగ్యాల రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అనంతరం సుభాష్ మాట్లాడుతూ.. ఆదివాసీ ఎరుకల కమిటీలను గ్రామ గ్రామాన వేసి ఎరుకల కులస్తులను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. తమ ఎరుకల కులస్తులను అగ్రవర్ణాలు కులస్తులు ప్రతి గ్రామాన తొక్కాలని చూస్తున్నారు. సమావేశంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు, జిల్లా యూత్ అధ్యక్షుడు అంగిడి ప్రశాంత్, మహారాష్ట్ర గడిచిరోలి జిల్లా సిరొంచ మండల ఎరుకల సంఘం అధ్యక్షులు నగేష్, మహదేపూర్ మండల అధ్యక్షుడు శ్రీరాముల పోషం, కోశాధికారి సుధాకర్, రవి, కేతిరి బాపూరావు, సుధాకర్, రాజమౌళి, బిక్షపతి, దేవర కొండా నాగరాజు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

'పేదలకు అందని వైద్యం'

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పేద ప్రజలకు వైద్యం అందడం లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్‌మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందన్నారు. సూపరింటెండెంట్ చంద్రశేఖర్ నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారన్నారు. పేదలకు వైద్యం చేయాల్సిన వైద్యులు, సిబ్బంది రోగులపై అసహనం వ్యక్తం చేస్తూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. జ్వరం వచ్చి ఆస్పత్రికి వెళితే కూడా భూపాలపల్లి, వరంగల్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్న వారిపై చర్యలు తీసుకొని వైద్యుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత

వాజేడు: సీజనల్ వ్యాధులను రాకుండా దోమలను నివరించాల్సిన బాధ్యత అందరిదని పల్లె దవఖాన వైద్యాధికారిని గ్యానస అన్నారు. మండల పరిధిలోని బొమ్మనపల్లి, కొత్తూరు గ్రామాల్లో వైద్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. దోమల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మూలంగా దోమలను ఎక్కువ శాతం నివారించవచ్చన్నారు. దోమల లార్వా పెరుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. నిల్వ నీరు ఉన్న గుంతల్లో లార్వా నివారణ మందును చల్లారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటింటికీ తిరిగి జ్వరాలు ఎవరెవరికి ఉన్నది సర్వే చేశారు. కొందరి నుంచి రక్త నమూనాలను సేకరించారు.



ఏటూరునాగారం: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కొత్తూరు గ్రామంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, శ్రీనివాస రావు, లలిత కుమారి, కన్యాకుమారి, ఆశ వర్కర్లు ఉన్నారు.

మంగపేట: మండంలలోని తిమ్మంపటేలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారిని వైశాలి ఆధ్వర్యంలో మాస్ ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది ఆశవర్కర్లు, 10 ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్‌తో కలిసి టీములుగా ఏర్పడి గ్రామంలోని 600 ఇళ్లల్లో జ్వరపీడితుల సర్వే నిర్వహించి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి గ్రామంలో హెల్త్ క్యాంపు, జ్వర సర్వేలు చేపట్టినట్లు కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో ఫ్రైడే డ్రైడే, జ్వరం బాధితులకు పరీక్షలు, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 35మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ఇందులో నలుగురికి మలేరియా పరీక్షలు చేయగా నెగెటివ్ రిపోర్ట్ వచ్చిందన్నారు. వేడి వేడి ఆహారం తీసుకోవాలని, ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఆశ కార్యకర్తలు సునీత, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మొగుళ్లపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇస్సిపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఇస్సిపేట గ్రామనికి చెందిన రైతు యార రాజిరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో పత్తి దున్నుతున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుత్ తీగ తగిలి ఎద్దు మృతి చెందింది. కరెంట్ తీగలు కిందికి ఉండడం వల్ల కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి చెందినట్లు రైతు రాజిరెడ్డి తెలిపాడు. సుమారు ఎద్దు విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.

ఓటు హక్కుపై సర్వే నిర్వహించాలి

కాటారం: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా బీఎల్‌ఓలు ఇంటింటా సర్వే నిర్వహించి ఓటు నమోదు చేయాలని నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్‌గౌడ్, మాస్టర్ ట్రైనర్ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం బీఎల్‌ఓలకు ఓటరు జాబితా తయారీ, ఓటు హక్కు నమోదుపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ పలు అంశాలను గూర్చి వివరించారు. బీఎల్‌ఓలు బీఎల్‌ఓ ఆప్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకన్న, జూనియర్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

కాళేశ్వరం: మహదేవపూర్, పలిమెల మండలాల్లోని బూత్ స్థాయి అధికారులకు ఓటు హక్కు నమోదుపై శిక్షణా కార్యక్రమం మహదేవపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులకు ప్రతి ఇంటి ఇంటికి సర్వే నిర్వహించి ప్రతి ఇంటిలోని వారి ఓటు హక్కులో ఎలాంటి తప్పులు ఉన్న వాటిని ఫారం 8 ద్వారా సరి చేయాలి అని తెలిపారు. ఓటర్ లిస్ట్ లో ఎవరైనా చనిపోయిన వారినీ గుర్తించి ఫారం 7 నమోదు చేయాలని తెలిపారు. జనవరి 1, 2025 వరకు 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఫారం 6 నమోదు చేయాలని పేర్కొన్నారు. బీఎల్‌ఓ ఆప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్,, పలిమెల తహసీల్దార్ అనిల్, మాస్టర్ ట్రైనర్స్ (ఏఎల్ఎంటీ) రాజేశ్వర్ రావు, రాజమొగిలిలు బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నాగరాజు

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా మలుపు



మండలంలోని రాఘవరెడ్డిపేట–ఇప్పలపల్లి ప్రధాన రోడ్డులో రాఘవరెడ్డిపేట శివారులో మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద రాయిని తొలగించిన అనంతరం భారీ గొయ్యి ఏర్పడింది. మలుపు వద్ద ఏమాత్రం ఆదమరిచినా గుంతలోకి వెళ్లే ప్రమాదం ఉంది. గొయ్యి ప్రాంతంలో రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. - టేకుమట్ల

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : రమేశ్, ఆర్అండ్‌బీ, డీఈ
ఫోన్‌నంబర్ : 83339 23856

కలప దుంగల స్వాధీనం



పట్టుకున్న కలప దుంగలను చూపిస్తున్న అధికారులు

కాటారం: మహదేవపూర్ నుంచి భూపాలపల్లి వైపుగా కాటారం మండల కేంద్రం మీదుగా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలప దుంగలను శుక్రవారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా కలప దుంగలు తరలిస్తున్నారనే సమాచారం మేరకు కాటారం శివారులో మాటు వేసి పట్టుకున్నట్లు కాటారం రేంజర్ ఆసిఫ్ అలీ తెలిపారు. 8 దుంగలు పట్టుకున్నట్లు వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని పేర్కొన్నారు. పట్టుకున్న దుంగలతో పాటు వాహనాన్ని సీజ్ చేసి మహదేవపూర్ కలప డిపోకు తరలించినట్లు తెలిపారు. అక్రమ కలప రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని రేంజర్ హెచ్చరించారు. డిప్యూటీ రేంజర్ సురేందర్, ఎఫ్ఎస్‌ఓ చంద్రశేఖర్, ఎఫ్‌బీఓలు రాజ్‌కుమార్, అశోక్, బేస్ క్యాంప్ రాజు, అటవిశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి, పామాయిల్ తోట ధ్వంసం

రూ.3.50లక్షల పంట నష్టం

చిట్యాల: మండలంలోని దూత్‌పల్లి గ్రామానికి చెందిన అంకేశ్వరపు నర్సయ్యకు సంబంధించిన వ్యవసాయ భూమిలో సాగు చేసిన పత్తి, పామాయిల్ తోటను అదే గ్రామానికి చెందిన కొంత మంది ధ్వంసం చేసినట్లు శుక్రవారం బాధిత రైతు తెలిపాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో తనకు రెండు ఎకరాలు వ్యవసాయ భూమి ఉందని, 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నాని పేర్కొన్నాడు. గత సంవత్సరంలో రెండు ఎకరాలలో పామాయిల్ మొక్కలను నాటినట్లు తెలిపాడు. ఈ క్రమంలో దూద్‌పల్లి గ్రామానికి చెందిన అంకేశ్వరపు భరత్, వరమ్మ, మల్లేష్, రాజులు కలిసి గురువారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన ఓ యజమానికి సంబంధించిన ట్రాక్టర్‌తో ధ్వంసం చేసినట్లు వాపోయాడు. పామాయిల్‌తో పాటు పాటు పత్తి పంటను ట్రాక్టర్‌తో దున్నివేశారని పేర్కొన్నారు. సాగు కోసం వేసిన డ్రిప్‌లైన్ పైప్‌లను కూడా దగ్ధం చేశారని తెలిపారు. దీంతో రూ.3.50లక్షల నష్టం వాటినట్లు బాధితుడు పేర్కొన్నాడు. వారిపై చర్యలు తీసుకోని న్యాయం బాధితుడు అధికారులను వేడుకున్నాడు.



ధ్వంసమైన పామాయిల్ తోట, పత్తి పంట

చేనేత కార్మికులను ఆదుకోవాలి

రేగొండ: చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని పద్మశాలీ సంఘం జిల్లా నాయకుడు భీమనాథుని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని రేపాక గ్రామంలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేనేత కార్మికులు నేసిన బట్టలపై జీఎస్టీనీ రద్దు చేసి కార్మికుల పక్షాన ఉండాలని కోరారు. చేనేత కార్మికులకు చేనేత బంధు అమలు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సమ్మయ్య, వెంగల నర్సయ్య, బండి సతీష్, వెంగల కోటేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ